
సాక్షి
నిజామాబాద్

సోమవారం । 2 । జూన్ । 2025



బల్దియాలో సంస్కరణలు

నిజామాబాద్ నగర పాలక సంస్థలో కమిషనర్ దిలీప్‌కుమార్ లోపాలు సవరిస్తూ, సంస్కరణలు చేపడుతున్నారు.

- 8లో ▸



కొత్త వంగడాలు..

రుద్రూర్ చెరుకు, వరి ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు మూడు కొత్త వంగడాలను రూపొందించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0 /24.2

ఉదయం ఆహ్లాదకరమైన, చల్లనిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నేడు రాష్ట్ర అవతరణ వేడుకలు

- ముఖ్య అతిథిగా ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నేడు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుగనున్నాయి. ఉదయం 10 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయి. రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకావిష్కరణ చేస్తారు. అంతకు ముందు 9.30 గంటలకు వినాయక్‌నగర్‌లోని అమరవీరుల పార్క్ వద్ద తెలంగాణ అమరవీరులకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా నివాళులు అర్పించనున్నారు.

పరేడ్ గ్రౌండ్ పరిశీలించిన సీపీ



నిజామాబాద్ నాగారం: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లను సీపీ సాయి చైతన్య పరిశీలించారు. వేడుకలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, పుర ప్రముఖులు హాజరుకానున్న దృష్ట్యా ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీపీ వెంట నిజామాబాద్ ఏసీపీ(అడ్మిన్) బస్వా రెడ్డి, అదనపు డీసీపీ (ఏఆర్) కే రామచంద్రరావు, టౌన్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, నార్త్ ఎమ్మార్వో విజయకాంతరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, టౌన్ 1 ఎస్సై రఘుపతి తదితరులు ఉన్నారు.

నేడు రైతులకు విత్తన బ్యాగుల పంపిణీ



డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రతీ గ్రామానికి నాణ్యమైన విత్తనాన్ని అందించాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ, అగ్రికల్చర్ యూనివర్సిటీ సంయుక్తంగా వరి, పెసర విత్తనాలను రైతులకు అందించాలని నిర్ణయించారు. ఇందుకోసం జిల్లాకు 880 వరి, 440 పెసర విత్తనాల బ్యాగులు తెప్పించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో తొలి విడతగా జిల్లాస్థాయిలో ఎంపిక చేసిన పది మంది రైతులకు విత్తనాలు అందజేయనున్నట్లు డీఏవో వీరాస్వామి తెలిపారు. వరిలో ఆర్‌డీఆర్-1200, పెసర్లు ఎంజీజీ-347 రకాలను మాత్రమే రైతులకు ఇస్తామన్నారు. 3న నియోజకవర్గస్థాయిలో ఎమ్మెల్యేల చేతుల మీదుగా రైతులకు పంపిణీ ఉంటుందన్నారు. ఆసక్తి గల రైతులు ఒక్క విత్తన బ్యాగుకి రూ.50లు చెల్లించి తీసుకెళ్లాలని, గ్రామానికి ముగ్గురు రైతులకు మాత్రమే ఈ అవకాశం ఉందన్నారు.

ప్రజావాణి వాయిదా


నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నేడు (సోమవారం) జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకల నేపథ్యంలో కార్యక్రమాన్ని వాయిదా వేశామని, తిరిగి జూన్ 9 నుంచి యథావిధిగా కొనసాగుతుందని సూచించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

మైనర్ డ్రైవింగ్‌లో 36 మంది పట్టివేత

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో మైనర్ డ్రైవింగ్స్‌పై సీపీ సాయి చైతన్య ప్రత్యేక దృష్టి పెట్టారు. కమిషనరేట్ పరిధిలో మైనర్లు వాహనాలు నడిపితే కఠినంగా వ్యవహరిస్తున్నారు. దీంతోపాటు పోలీసులు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. వారం రోజులుగా మైనర్ డ్రైవింగ్ చేస్తూ 36 మంది పోలీసులకు చిక్కడం చర్చనీయాంశంగా మారింది. దీంతో సీపీ ఆదేశాల మేరకు వారితో నగరంలోని ప్రధాన కూడళ్లలో ప్లకార్డులతో ప్రచారం చేయించారు. మైనర్ డ్రైవింగ్ చేయవద్దంటూ ప్లకార్డులు పట్టుకుని నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద నిలబడ్డారు. వేగం మోజులో పడి తల్లిదండ్రులకు గుండెకోత మిగల్చవద్దని సూచిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. సీపీ సాయి చైతన్య తీసుకుంటున్న చర్యలపై నగర ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

ఈసారీ బాదుడే..

- ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల మోత
- ఇంజినీరింగ్, మెడిసిన్ విద్య పేరిట అధిక ఫీజులు
- సామాన్య, మధ్యతరగతి వారికి తప్పని కష్టాలు
- పుస్తకాలు, దుస్తుల కొనుగోళ్లు పాఠశాలల్లోనే..
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ



నిజామాబాద్‌అర్బన్: ప్రైవేటు విద్యా సంస్థల ఫీజుల దోపిడీ తల్లిదండ్రులు, విద్యార్థులను మనోవేదనకు గురిచేస్తోంది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఫీజులు భారంగా మారాయి. లాభార్జనే ధ్యేయంగా కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల పెంపుదలను కొనసాగిస్తున్నాయి. పాఠశాల ఫీజుతోపాటు ల్యాబ్, లైబ్రరీ, స్పోర్ట్స్ ఇతర ఫీజులు, ట్యూషన్ ఫీజు కింద అందినకాడికి దండుకుంటున్నాయి. ఫీజుల నియంత్రణను నిరంతరం పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

> ఈ విద్యా సంవత్సరంలో అధిక ఫీజుల వసూళ్లకు ప్రైవేటు పాఠశాలలు రంగం సిద్ధం చేసుకున్నాయి. ఈసారి ఫీజుల మోత మోగించనున్నాయి. ఐఐటీ, మెడిసిన్ ఫౌండేషన్ పేరిట ప్రత్యేక విద్యాబోధన అంటూ ఫీజులు పెంచేశాయి. మరికొన్ని పాఠశాలలు సీబీఎస్‌ఈ సిలబస్ పేరిట ప్రత్యేక ఫీజులు వసూలు చేస్తున్నాయి.

ఉత్తర్వుల అమలు ఎక్కడ ?

ఫీజుల నియంత్రణపై అధికారుల నిర్లక్ష్యంతో ప్రైవేటు పాఠశాలల ఆగడాలు అంతేలేకుండా పోయాయి. 2017 ఫిబ్రవరిలో ప్రొఫెసర్ తిరుపతిరావు నేతత్వంలోని ఒక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ 2018 మార్చిలో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తూ ఏటా 10 శాతం ఫీజులను పెంచుకోవచ్చునని ప్రతిపాదనలు చేసింది. కానీ ఇంత వరకు ఆ కమిటీ సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదు. 2020 ఏప్రిల్‌లో ఫీజుల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు నంబర్ 46ను జారీ చేసింది. జీవో నంబర్ 01 ప్రకారం ట్యూషన్ ఫీజులను నియంత్రించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కానీ, ఉత్తర్వుల అమలుకు విద్యాశాఖ అధికారులు మీనమేషాలు లెక్కబెడుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి మొదలుకొని మండల విద్యాశాఖ అధికారులకు వరకు ఒక్కరు కూడా ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేయడం లేదనేది బహిరంగ రహస్యమే. ఫిర్యాదు వస్తేనే చూద్దామనే ధోరణిలో అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కొందరు ఎంఈవోలు ప్రైవేటు యాజమాన్యాలతో మిలాఖత్‌అయి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం అడ్మిషన్ ఫీజులు వసూలు చేయొద్దు. కానీ, జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు అడ్మిషన్ ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఇదంతా తెలిసినా అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం.

కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల వివరాలు (రూ.లలో)

తరగతి	ఫీజులు		
		2వ	35,000
ఎల్‌కేజీ	35,000	3వ	35,000
యూకేజీ	40,000	4వ	36,000
1వ	34,000	5వ	36,000

ఎల్‌కేజీకి రూ.65వేలా?

జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 498 ప్రైవేటు పాఠశాలలు కొనసాగుతున్నాయి. వీటిలో 1.73 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆర్మూర్, నిజామాబాద్, బోధన్, భీమ్‌గల్, డిచ్‌పల్లి వంటి పట్టణాల్లో ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ నుంచి ఫీజుల భారం మోపుతున్నారు. జిల్లా కేంద్రంలో ఎల్‌కేజీ విద్యార్థికి అన్ని ఫీజులు కలుపుకొని రూ.65 వేల వరకు ఒక కార్పొరేట్ పాఠశాల వసూలు చేస్తోంది. టెక్నో పాఠశాల, డిజిటల్ బోధన, ఐఐటీ ఫౌండేషన్ పేరిట మరికొన్ని పాఠశాలల యాజమాన్యాలు అత్యధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఆర్మూర్ గ్రామీణ ప్రాంతంలో ఓ కార్పొరేట్ పాఠశాల, బోధన్ రాకాసీపేటలో మరో ప్రైవేటు పాఠశాలలోని ఫీజులు మధ్యతరగతి వారికి అందనంత ఎత్తులో ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల 6 నుంచి 10వ తరగతి వరకు రూ. 86 వేల ఫీజు వసూలూ చేస్తోంది. ఏసీ తరగతులంటూ ప్రచారం చేస్తోంది. అనుమతి లేకుండా కొనసాగుతున్న సీబీఎస్‌ఈ పాఠశాలలో ఏకంగా రూ.లక్ష వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. కాగా, సర్కారు బడుల్లో పిల్లలను చేర్పించాలని ప్రచారం చేస్తున్న విద్యాశాఖ అధికారులు.. ప్రైవేటు పాఠశాలల తనిఖీకి విముఖత చూపడంపై విమర్శలు వస్తున్నాయి.

“ చర్యలు తీసుకుంటాం



అధిక ఫీజుల వసూళ్లపై ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల మేరకే ఫీజులు వసూలు చేయాలి. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు కూడా నిబంధనలు తెలియజేస్తాం.

– అశోక్, డీఈవో

మూడు నెలల కోటా.. ఆరుసార్లు వేలిముద్ర

- రేషన్ బయోమెట్రిక్‌లో మార్పులు
- లబ్ధిదారుల ఇబ్బందులు

డిచ్‌పల్లి: మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీకి తొలిరోజు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురయ్యాయి. బయోమెట్రిక్‌లో మార్పులు చోటు చేసుకోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం మూడు నెలల కోటా ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో సాంకేతిక సమస్యలు, నిబంధనల మార్పుతో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. గతంలో రేషన్ తీసుకోవడానికి లబ్ధిదారుడు ఒకసారి బయోమెట్రిక్ వేసేవారు. ప్రస్తుతం ఒక నెల రేషన్‌కు రెండుసార్లు బయోమెట్రిక్ వేసేలా మార్పులు చేశారు. ఒకరికి 6 కిలోల బియ్యం ఇస్తుండగా, కేంద్రం వాటా 5 కిలోలకు ఒకసారి, రాష్ట్రవాటా 1 కిలోకి మరోసారి బయోమెట్రిక్ వేయాల్సి వస్తోంది. ప్రస్తుతం మూడు నెలల రేషన్ ఒకేసారి ఇస్తుండటంతో మొత్తం 6 సార్లు బయోమెట్రిక్ వేయాల్సి వస్తుండగా, ప్రతి వినియోగదారుడికి కనీసం 15-20 నిమిషాలు సమయం పడుతోంది. దీంతో ఇతర వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఓటీపీ విధానం రద్దు..

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, మోపాల్, నిజామాబాద్ రూరల్, సిరికొండ, జక్రాన్‌పల్లి మండలాలలో మొత్తం 165 రేషన్ దుకాణాలు ఉండగా 85 దుకాణాలకు మాత్రమే ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి బియ్యం సరఫరా అయింది. దీంతో పలు గ్రామాల్లోని రేషన్ షాపుల్లో ఇంకా బియ్యం పంపిణీ ప్రారంభం కాలేదు. రేషన్‌కార్డులో ఒకరు లేదా ఇద్దరు వ్యక్తులు ఉంటే ఓటీపీ విధానంలో ఇతరుల సహాయంతో రేషన్ బియ్యం తీసుకునే వారు. ఈసారి ఆ విధానం రద్దు కావడంతో వారు సైతం రేషన్ దుకాణం వరకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆరుసార్లు వేలిముద్ర విధానంతో వినియోగదారులకు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా త్వరలోనే ఈ-పాస్ మిషన్‌లో మార్పులు తెచ్చి ఒకేసారి వేలిముద్రతో బియ్యం తీసుకునేలా చేయాలని అధికారులు నిర్ణయించారు.



డిచ్‌పల్లి మండలం ధర్మారం(బీ)లో రేషన్ బియ్యం తీసుకుంటున్న వినియోగదారులు

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం



వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

- నెలలు గడుస్తున్నా రహదారులపైనే ధాన్యపు రాశులు
- మొలకెత్తిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనుగోలు చేయాలి
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో ఆదివారం ఓ కార్యక్రమానికి హాజరై వెళ్తుండగా రహదారిపై మొలకెత్తిన ధాన్యాన్ని, తూకం వేయకుండా ఉన్న ధాన్యపు రాశులను ఆయన బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు ఇంకా కష్టాలు తప్పడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై 3 నెలలవుతున్నా రోడ్లపై ధాన్యపు రాశులు ఉన్నాయన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు జరుగక అకాల వర్షాలకు తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని కిలోకు రూ. 4 లేదా రూ. 5 కు అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. దీనికి కారణం సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనమేనని ఆరోపించారు. సీఎంకు అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని విమర్శించారు. అక్కడే ఉన్న ఓ రైతు ఈ రోజే కొనుగోలుకు చివరి రోజని, రేపటి నుంచి కొనుగోలు చేయమని అంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో అక్కడి నుంచే కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో ఫోన్‌లో మాట్లాడారు. మరో నాలుగు రోజులు సెంటర్ కొనసాగించి పూర్తి ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్‌ను కోరారు. రేపటి నుంచి వడ్లు కొనుగోలు చేయమని రైతులు భయపడేలా చేసిన ఐకేపీ అధికారిని ఎమ్మెల్యే మందలించారు.

ఏఎంసీల ఫీజు వసూళ్ల లక్ష్యాలు ఖరారు

- కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీకి రూ. 60 లక్షలు
- వేల్పూర్ మార్కెట్ కమిటీకి రూ. 32.50 లక్షలు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి, వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)ల మార్కెటింగ్ రుసుం వసూలు లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఖరారు చేసింది. గతేడాది నిర్దేశించిన లక్ష్యానికి మించి ఆదాయం పొందడంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ రెండు మార్కెట్ కమిటీలకు కలిపి రూ. 92.50 లక్షలుగా మార్కెటింగ్ రుసుము(ఫీజు) రూపంలో లక్ష్యం నిర్దేశించింది. ఇందులో కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీకి రూ. 60 లక్షలు, వేల్పూర్‌కు రూ.32.50 లక్షలుగా పేర్కొంది. ఈ మేరకు లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.

గతేడాది లక్ష్యానికి మించి..

రైతులు పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించే క్రమంలో మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు వద్ద ఆపి మార్కెటింగ్ ఫీజు వసూలు చేస్తారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న, సోయాబీన్, జొన్నలను మార్కెట్‌కు తరలిస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కమ్మర్‌పల్లి ఏఎంసీకు రూ. 50లక్షల మార్కెటింగ్ ఫీజు లక్ష్యం ఉండగా, రూ.58 లక్షలు వసూలయ్యాయి. వేల్పూర్ ఏఎంసీకి రూ. 25లక్షలు లక్ష్యం కాగా, రూ. 32.53 లక్షలు వసూలయ్యాయి. దీంతో ప్రస్తుత ఏడాది లక్ష్యాన్ని పెంచింది.



కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

“ గడువులోగా లక్ష్యం పూర్తి చేస్తాం..

ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని సిబ్బంది సహకారంతో గడువులోగా పూర్తి చేస్తాం. గతేడాది విధించిన లక్ష్యాన్ని సమర్థవంతంగా పూర్తిచేశాం. మార్కెట్‌కు తరలే ప్రతి వాహనాన్ని చెక్‌పోస్ట్ వద్ద సిబ్బంది ఆపి తనిఖీ చేసి మార్కెటింగ్ ఫీజు వసూలు చేస్తున్నారు.

– టీ మెర్సీ, కమ్మర్‌పల్లి, వేల్పూర్ మార్కెట్ కమిటీల కార్యదర్శి

‘ఒకే దేశం-ఒకే ఎన్నిక’ బీజేపీ లక్ష్యం

- సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యం
- పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు
- బీఆర్‌ఎస్ ఇంటిపోరుతో బీజేపీకి సంబంధం లేదు
- బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్, పక్కన పల్లె గంగారెడ్డి, దినేశ్ కులాచారి

నిజామాబాద్ సిటీ: ‘ఒకే దేశం-ఒకే ఎన్నిక’ అనే విధానం దేశానికి చాలా అవసరమని, ఇదే బీజేపీ ఆలోచనా విధానమని దీంతో జాతీయ సమైక్యత, సమర్థతను తీసుకువచ్చేందుకు దోహదపడుతుందని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్ పేర్కొన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీసీ కులగణన చేశామని కాంగ్రెస్ గొప్పలు చెప్పుకుంటోందని, వాస్తవానికి జనగణన అనేది కేంద్ర పరిధిలోని అంశమన్నారు. కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ 2021లోనే జనగణన చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. రాహుల్‌గాంధీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఒకమాట, విపక్షంలో ఉన్నప్పుడు మరోమాట మాట్లాడతారని విమర్శించారు. కులగణనను కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని ఎద్దేవా చేశారు. పేద ప్రజల కోసం కేంద్రం ఎన్నో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. ఓబీసీలకు రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు చిత్తశుద్ధి లేదన్నారు. బీజేపీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందన్నారు. ఓబీసీ జాతీయ కమిషన్‌కు చట్టబద్ధ హోదా ఇచ్చిందని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ కవిత కొత్తగా బీసీ నినాదం ఎత్తుకోవడంపై ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌లో ఇంటిపోరు నడుస్తోందని, దాంతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. బీజేపీ ఎవరితో పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సాహసోపేత నిర్ణయమని ప్రపంచం ప్రశంసిస్తుంటే, కాంగ్రెస్ ఎంపీలు అనుచిత విమర్శలు చేయడం బాధాకరమన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తంచేశారు. విలేకరుల సమావేశంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్, నాయకులు స్రవంతిరెడ్డి, పద్మారెడ్డి, పోతనకర్ లక్ష్మీనారాయణ, మాస్టర్ శంకర్, సాయి వర్ధన్, వెల్డింగ్ నారాయణ, తారక్ వేణుగోపాల్, బాలాపురం ఆనంద్ రావు, కోడూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసులకు సేవా పతకాలు

- మహోన్నత సేవా పతకానికి ఇద్దరు, ఉత్తమ సేవా పతకానికి ఒకరు ఎంపిక



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ సేవా పతకాలను ప్రకటించింది. రాష్ట్ర హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా నుంచి చాలా మంది పోలీసులు ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు. వీరికి నేడు హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పతకాలు అందజేయనున్నారు. ఇందులో మహోన్నత సేవా పతకానికి సీసీఎస్‌లో పనిచేస్తున్న సీఐ పోలు రవీందర్, ఇంటలిజెన్స్ విభాగంలో ఎస్సైగా పనిచేస్తున్న వి కృష్ణ ఎంపికయ్యారు. ఉత్తమ సేవా పతకానికి రుద్రూరు ఎస్సై పి సాయిన్న ఎంపికయ్యారు. సేవా పతకాలకు ట్రాఫిక్ ఎస్సై ఎండీ రహమతుల్లా, వీఆర్‌లో ఉన్న ఎస్సై డి పీటర్, నారాయణసింగ్, హెడ్‌క్వార్టర్‌లో ఆర్‌ఎస్సైగా ఉన్న జె చంద్రశేఖర్, ఏఆర్‌ఎస్సైలు ఎస్ వినోద్‌రావు, ఎండీ అమీరొద్దీన్, సహిద్ ఇతియాజ్‌అలీ, సీఎస్‌బీలో ఏఎస్సైగా ఉన్న కె గంగాధర్, నవీపేట ఏఎస్సై కె మోహన్‌రెడ్డి, ఐదో టౌన్ ఏఎస్సై టి శ్రీనివాస్‌గౌడ్, సీసీఆర్‌బీలో ఏఎస్సైగా ఉన్న శ్రీనివాస్ రెడ్డి, హెడ్‌క్వార్టర్ ఏఆర్‌ఎస్సైలు టి గంగాధర్, మాధవ గోపాల్, హెడ్‌క్వార్టర్ ఏఆర్‌హెచ్‌సీలు ఎం ప్రసాద్, ఎస్ సంగారెడ్డి, మిర్జానజీర్‌బేగ్, సీటీసీ హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్‌గౌడ్, ట్రాఫిక్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ డి మోహన్, ఏర్గట్ల హెడ్‌కానిస్టేబుల్ పుట్టి గంగాధర్, వేల్పూర్ హెడ్‌కానిస్టేబుల్ ఎస్ గంగాధర్‌రావు, హెడ్‌క్వార్టర్ ఏఆర్‌హెచ్‌సీలు టి నరేందర్, బి బాల్‌సింగ్, ఆకుల ఆగమయ్య, వై చంద్రప్రకాశ్, ఎస్ వెంకట్‌రాములు, ఎం నాగరాజు, బి మోజీరాం, కె కృష్ణ, బి మహేశ్వర్, గోపు రాజు, సీటీసీ కానిస్టేబుల్ శశిభూషణ్‌రావు, హెడ్‌క్వార్టర్ ఏఆర్‌పీసీ శ్రీనివాస్, సీసీఆర్‌బీ కానిస్టేబుల్ కాలూరుశ్రీనివాస్, హెడ్‌క్వార్టర్ ఏఆర్‌పీసీ కిషన్, మోర్తాడ్ కానిస్టేబుల్ పి జనార్దన్‌రెడ్డి, ఇంటలిజెన్స్ విభాగం హెడ్‌కానిస్టేబుల్ బి దామోధర్, సీఐడీ విభాగం ఏఎస్సై ఎ రాజేశ్వర్‌రావు, ట్రాన్స్‌కో హెడ్‌కానిస్టేబుల్ కె రవికిరణ్ ఎంపికైన వారిలో ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



మాక్లూర్: నల్గొండ జిల్లాలో ఈనెల 4, 5, 6వ తేదీల్లో నిర్వహించే 47వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్, మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్‌బాల్ పోటీలకు క్రీడాకారులు ఎంపికయ్యారు. మాక్లూర్ మండలం కల్లెడి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికల ప్రక్రియను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు టి విద్యాసాగర్ రెడ్డి పర్యవేక్షించారు. అనంతరం ఇటీవల సౌత్ జోన్ హ్యాండ్‌బాల్ నేషనల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చిన జిల్లాకు చెందిన సంకీర్తనను అభినందించారు. హ్యాండ్‌బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్, కోశాధికారి జీ రాజేశ్, పీడీలు రమణ, మాధురి, పీఈటీ సంజీవ్, సీనియర్ క్రీడాకారులు రాహుల్, సాయి, విష్ణు, శ్రావణీత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీసీసీ క్రమశిక్షణ సంఘం కార్యవర్గం ప్రమాణస్వీకారం



చైర్మన్, సభ్యులను సన్మానిస్తున్న జిల్లా నాయకులు

నిజామాబాద్‌సిటీ: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో చైర్మన్‌గా మల్లు రవి, సభ్యుడిగా జిల్లాకు చెందిన జీవీ రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేపట్టారు. కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్, సభ్యులను జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు శాలువాతో సత్కరించారు. తన నియమకానికి కృషి చేసిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కు రామకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు వచ్చిన ఈ పదవితో మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎడ్ల నాగరాజ్, రాం భూపాల్, హరిబాబు, బాబి, ధర్మారం నవీన్, పత్తి శోభన్ కుమార్, సర్దార్ గబ్బర్ సింగ్, సుమన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్



ప్రతిభా అవార్డులు అందజేస్తున్న లక్ష్మణ్


నిజామాబాద్‌నాగారం: మున్నూరు కాపు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. తెలంగాణ మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎస్సెస్సీ, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన మున్నూరు కాపు విద్యార్థులకు ప్రతిభా అవార్డులను జిల్లా కేంద్రంలో అందజేశారు. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. యువత లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులచారి, తోట రాజశేఖర్, బాల శ్రీనివాస్ పటేల్, ధర్మపురి సురేందర్, సరాల రత్నాకర్, అబ్బాపూర్ రవి, బుస్సా ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, రెంజర్ల నరేశ్, హరిచరణ్, చిట్టి నారాయణరెడ్డి, సాయికుమార్, వాసు, శేఖర్, మోహన్, స్వర్ణలత, యెండల స్వప్న, ఆకుల పుష్పకుమారి పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌కు గాయాలు

నవీపేట: మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంక్‌లో ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌ను గాయాలయ్యాయి. స్టేషన్ ఏరియాకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ సాయిలు పెట్రోల్ బంక్‌లో కరెంటు లేకపోవడంతో మరమ్మతులు చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. ఎల్‌సీ తీసుకోకుండానే మరమ్మతులు చేయడంతో ఒక్కసారిగా కరెంట్ షాక్ గురయ్యాడు. చేతులకు, వీపుపై గాయాలయ్యాయి. స్థానికులు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

బల్దియాలో సంస్కరణలు

- కార్పొరేషన్‌ను గాడిలో పెడుతున్న కమిషనర్ దిలీప్‌కుమార్
- శానిటరీ, రెవెన్యూ విభాగాల్లో లోపాలు గుర్తింపు
- పన్నుల వసూళ్లలో మెరుగైన ఫలితాలు
- పారదర్శకంగా సాగుతున్న పనులు



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తెలంగాణలోనే మూడో అతి పెద్దది. నాలుగు లక్షల జనాభా గల ఈ మున్సిపాలిటీ కరీంనగర్, వరంగల్‌తో పోల్చితే అంతగా అభివృద్ధి జరగలేదు. కానీ కొందరు మున్సిపల్ కమిషనర్లు మాత్రం నగర అభివృద్ధికి మనసు పెట్టి పనులు చేశారు. తమదైన మార్కు చూయించారు. అందులో గతంలో పనిచేసిన వాసం వెంకటేశ్వర్లు, చిత్రమిశ్రా.. అదే మార్గంలో కొత్తగా వచ్చిన దిలీప్‌కుమార్. 2024అక్టోబర్29న బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటివరకు అంకితభావంతో పనులు చేస్తున్నారు. బల్దియాలోని లోపాలు సవరిస్తూ, కొత్త సంస్కరణలు చేపడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ దిలీప్‌కుమార్ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

శానిటరీ, రెవెన్యూ విభాగాల్లో లోపాలు

బల్దియాలో ప్రధాన విభాగాలు రెవెన్యూ, శానిటేషన్. వీటిలో విపరీతమైన లొసుగులున్నాయి. బల్దియాకు రావాల్సిన పన్నుల్లో నిర్లక్ష్యం, పక్షపాతం, తీసుకున్న బిల్లులకు లెక్కలు చూపకపోవడం, చెల్లించాల్సిన పన్నుల కన్నా తక్కువ తీసుకోవడం. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వడం వంటి వాటిని సవరించారు.

రికార్డు స్థాయిలో పన్నుల వసూలు

బల్దియాకు రావాల్సిన పన్నులు 2024–25 ఆర్థిక సంవత్సరం రూ.45 కోట్లకు పైగా వసూలు చేశారు. ఎర్లీబర్డ్ ఆఫర్(ముందస్తు చెల్లింపులో) కూడా రికార్డు స్థాయిలో రూ.30 కోట్ల మేర వసూలు చేశారు. గతంతో పోల్చితే రూ.8 కోట్లు అధికం. ఇది రాష్ట్రంలో ఇతర మున్సిపాలిటీలతో ముందువరుసలో ఉన్నట్లే.

వెహికిల్ మెయింటెనెన్స్‌లో..

బల్దియాలో చెత్త సేకరణ, తొలగింపు కోసం 137 వాహనాలున్నాయి. వీటి మరమ్మతుల పేరుతో ప్రతినెల లక్షల రూపాయల ధనం పక్కదారిపడుతోంది. గతంలో ఒక టైర్ పంక్చర్‌కు రూ.2,500 బిల్లులు వేసేవారు. ఇందులో 50 శాతంపైగా నకిలీ బిల్లులే. దీంతో ప్రస్తుత కమిషనర్ వెహికిల్స్ రిపేర్ పేరుతో జరిగే దోపిడీకి అడ్డుకట్ట వేశారు. వీటిని నియంత్రించేందుకు బల్దియాలోనే మెకానిక్ షెడ్‌ను ఏర్పాటు చేశారు. మెకానిక్ ఇంజినీర్‌తోపాటు ఇద్దరు మెకానిక్‌లను నియమించారు. దీంతో ప్రతినెల రూ.2.75 లక్షలు ఆదా అవుతోంది.

శానిటరీ అటెండెన్స్‌లో గోల్‌మాల్‌కు చెక్..

పారిశుధ్య విభాగంలో అంతా అవినీతే. ఉద్యోగులు హాజరుకాకున్నా అటెండెన్స్ వేయడం, సగం మంది పర్మినెంట్ ఉద్యోగులు రాకున్నా హాజరు వేస్తూ ఇలా ఒక్కొక్కరి నుంచి రూ.15 నుంచి 20 వేలు వసూలు చేసేవారు. దీంతో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు, హాజరుపట్టిక తనిఖీలతో ఫేక్ అటెండెన్స్‌కి అడ్డుకట్ట పడింది. బదిలీ వర్కర్ల పేరుతో జరుగుతున్న అవినీతికి అడ్డుకట్ట వేశారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు

బల్దియాకు వచ్చేవారికి తగిన సమాచారం కోసం 'హెల్ప్ డెస్క్'ను ఏర్పాటు చేశారు. నగరంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు బల్దియా ఆధ్వర్యంలో పెయిడ్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో 'భువన్ సర్వే' కొనసాగుతోంది. అండర్ అసెస్‌మెంట్‌ను, రీఅసెస్‌మెంట్‌లను చేపడుతున్నారు. కార్పొరేషన్ పరిధిలో 72 రైస్ మిల్లులకు రీఅసెస్మెంట్ చేయిస్తున్నారు. బల్దియాలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు మొదటి వారంలోనే వేతనాలు అందిస్తున్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించేలా సర్క్యులర్ జారీచేసి వారిలో జవాబుదారీ తనం పెంచారు. కార్పొరేషన్‌లో జరుగుతున్న పనులపై నగరవాసులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వృథా ఖర్చులకు కళ్లెం

గతంలో బల్దియాలో కోట్ల రూపాయలు వృథాగా ఖర్చయ్యేవి. మున్సిపల్ వాహనాల డీజిల్‌కు నెలకు రూ.6 లక్షలు ఖర్చు పెట్టేవారు. కమిషనర్ పాలనలో పోలీసు పెట్రోల్‌బంక్‌కు డీజిల్‌ను ఇవ్వడం ద్వారా ప్రతి నెల డీజిల్ రూపంలో బల్దియాకు రూ. 6 లక్షల నగదును ఆదా చేస్తున్నారు. అలాగే జిరాక్స్ పేరుతో సైతం నెలకు రూ. లక్షల బిల్లులు చెల్లిస్తున్నారు. గత పదిహేనేళ్లుగా ఒకే జిరాక్స్ సెంటర్‌కు ఆర్డర్ ఇస్తూ లక్షల రూపాయల ప్రజాధనం వృథా చేశారు. ఇకపై జిరాక్స్‌లు బల్దియాలోనే చేయించడంతో లక్షల రూపాయలు ఆదా అవుతోంది.

అభివృద్ధికి సహకరించాలి



నగర ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలి. ఉన్న వనరులతో ప్రాధాన్యతాక్రమంలో పనులు చేపడుతున్నాం. ఏవైనా సమస్యలుంటే నా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం.

– దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

కొత్త వంగడాలతో అధిక దిగుబడులు

- రుద్రూర్ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం కృషి
- చెరుకు, వరిలో నూతన వంగడాలు సృష్టి



డాక్టర్ అంజయ్య

రుద్రూర్: రైతులకు వ్యవసాయంలో అవసరమగు సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు కొత్త వంగడాలను రూపొందించి రైతులకు అందించడానికి 1935లో రుద్రూర్ చెరుకు, వరి ప్రాంతీయ పరిశోధన స్థానాన్ని ఏర్పాటు చేశారు. కాలానుగుణంగా నాటి నుంచి ఎన్నో చెరుకు, వరి వంగడాలు రూపొందించి రైతులకు పరిచయం చేశారు. చీడ పీడలను తట్టుకుని అధిక దిగుబడులు సాధించే వంగడాల కోసం శాస్త్రవేత్తలు నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారు. కొత్తగా తెగుళ్లను తట్టుకుని మంచి దిగుబడినిచ్చే చెరుకు, రెండు వరి వంగడాలను రూపొందించి రైతులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ మూడు కొత్త వంగడాలు గూర్చి పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ అంజయ్య ఆయన మాటల్లో..

రుద్రూర్ చెరుకు-81 రకం



రుద్రూర్ చెరుకు ఆర్-81

ఇది గతేడాది రుద్రూర్ పరిశోధన స్థానం నుంచి విడుదల చేయబడ్డ మధ్యస్థ చెరుకు రకం. రాష్ట్రంలో సాగునీరు అందుబాటులో ఉన్న ప్రాంతాలకు అనుకూలమైనది. ఎర్ర కుళ్లు తెగులు, కొరడా తెగులు, పసుపు ఆకు తెగులు కొంత వరకు తట్టుకుంటుంది. పీక పురుగు, కాండం తొలుచు పురుగు, పొలుసు పురుగును తట్టుకుంటుంది. దిగుబడి హెక్టారుకు 125.5 టన్నులు వస్తుంది. బెల్లం దిగుబడి 16.47 టన్నులు. 19.4శాతం సుక్రోస్ కల్గి ఉంటుంది.

రుద్రూర్ వరి ఆర్‌డీఆర్-1200



వరి ఆర్‌డీఆర్-1200

ఈ రకాన్ని జగిత్యాల్ సాంబ(జేజీఎల్–3844), నెల్లూర్ మసూరి(ఎన్ఎల్ఆర్–344449) అనే రకాలను రూపొందించారు. లక్షణాలు: వాన కాలంలో సాగుకు అనువైన మధ్య కాలిక రకం. 130–135 రోజుల్లో పంట చేతికి వస్తుంది. సన్న గింజ కలిగి తక్కువ నూక శాతంతో అన్నం నాణ్యత కలిగి ఉంటుంది. కాండం బలమైనది. పైరు చేను మీద పడిపోదు. సుడి దోమ, ఉల్లి కోడును కొంత వరకు తట్టుకుంటుంది. ఎకరానికి సుమారు 32–34 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

రుద్రూర్ వరి ఆర్‌డీఆర్-1162

ఇది స్వల్ప కాలిక రకం. రెండు కాలలకు అనువైనది. వాన కాలంలో 120–125 రోజులకు, యాసంగిలో 130–135 రోజులకు పంట చేతికి వస్తుంది. మిక్కిలి సన్న గింజ రకం. ఎకరాకు సుమారుగా వాన కాలంలో 32, యాసంగిలో 34 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. తక్కువ నూక శాతం ఉంటుంది. కంకినల్లి, ఉల్లికోడు, ఆకు తెగులు, మెడ విరుపు తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. గంగా కావేరి కన్నా అతి సన్న గింజ కలిగి ఉంటుంది. అన్నం మంచి నాణ్యతను, రుచిని కలిగి ఉంటుంది. ఈ రకం 7–10 రోజుల నిద్రావస్థ కలిగి ఉన్నందున కోసిన ధాన్యాన్ని వెంటనే విత్తనంగా వాడు కోవాలంటే బాగా ఎండబెట్టిన తర్వాత మొలక శాతాన్ని



వరి రకం ఆర్‌డీఆర్-1162

పరీక్షించి నారు పోసుకోవాలని పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ అంజయ్య వివరించారు. పరిశోధనలు జరిపి శాస్త్రవేత్తలు రూపొందించిన కొత్త వరి రకాలను రైతులు సాగు చేసి లబ్ధి పొందాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సెయింట్ జాన్స్ హై స్కూల్ 1991-92 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

జిల్లాలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదోతరగతి, ఇంటర్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలవడంతో ఆనందం వ్యక్తం చేశారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. – సాక్షి నెట్‌వర్క్



ముదక్‌పల్లి జెడ్పీ పాఠశాల 2000-01 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



నందిపేటలోని నంది ప్రగతి పాఠశాల 2000-01 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



రామన్నపేట్ జెడ్పీ హెచ్ఎస్ 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాల 2002-04 ఇంటర్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు



నవీపేట బాలుర ఉన్నత పాఠశాల 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



పొతంగల్ హైస్కూల్ 1996-97 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



పెద్దవాల్గోట్ 2001-02 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

లైసెన్స్ రెన్యువల్ ఈజీగా చేసుకుందాం ఇలా..

మీకు తెలుసా?



ఒకసారి తీసుకున్న డ్రైవింగ్ లైసెన్స్ గడువులోగా రెన్యువల్ చేసుకోవడం చాలా మంది మరిచిపోతుంటారు. గడువు తీరిన 30 రోజుల్లోపు రెన్యువల్ చేయించుకోకుంటే జరిమానా విధిస్తారు. మరీ ఎక్కువ రోజులైతే రద్దు చేసే అవకాశం ఉంది.

- గతంలో ఆర్టీఏ కార్యాలయం చుట్టూ తిరిగాల్సి వచ్చేది. https:// transport. telangana. gov. in/ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఈజీగా రెన్యువల్ చేసుకోవచ్చు.
- ముందుగా రవాణాశాఖ వెబ్‌సైట్‌లోకి వెళ్లి లైసెన్స్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ ఎంచుకుంటే మరో పేజీ ఓపెన్ అవుతుంది.
- అందులో కింద ఉండే రెన్యువల్ ఆఫ్ డ్రైవింగ్ లైసెన్స్‌పై క్లిక్ చేయాలి.
- తర్వాత క్లిక్ హియర్ టు బుక్ ది స్లాట్ ఆప్షన్ ఎంచుకోవాలి.
- మరో కొత్త విండోలో కనిపించే డ్రైవింగ్ లైసెన్స్ బాక్స్‌లోని రెన్యూవల్ ఆఫ్ లైసెన్స్ తర్వాత కంటిన్యూ స్లాట్ బుకింగ్‌ని క్లిక్ చేయాలి.
- తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ నంబరు, ఎక్కడ ఇచ్చారు, పుట్టిన తేదీ, మొబైల్ నంబరు తదితర వివరాలు నమోదు చేయాలి.
- రిక్వెస్ట్ ఓటీపీని క్లిక్ చేస్తే మన ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది.
- దానితో పాటు క్యాప్చర్‌ను ఎంటర్ చేసి గెట్ డీటైల్స్‌పై నొక్కగానే వివరాలన్ని కనిపిస్తాయి.
- జాగ్రత్తగా పరిశీలించి కన్ఫమ్ క్లిక్ చేయాలి. తర్వాత పేమెంట్ ఆప్షన్ ద్వారా రుసుం చెల్లించాలి.
- ప్రింట్ తీసుకుని నిర్దేశించిన తేదీ రోజు ఒరిజినల్ లైసెన్స్, గుర్తింపు కార్డుతో ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి.
- అక్కడ అధికారులు పరిశీలించి డ్రైవింగ్ లైసెన్స్‌ను రెన్యువల్ చేస్తారు.

– కామారెడ్డి టౌన్

పరేడ్ గ్రౌండ్ ముస్తాబు





నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌ను ముస్తాబు చేశారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించి వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. వేడుకల్లో లోటుపాట్లకు తావులేకుండా, పరేడ్ మైదానాన్ని సుందరంగా ముస్తాబు చేశారు.

క్రైం కార్నర్

దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన ఆర్ చిన్న సాయిలును పొలం విషయమై ఘర్షణ పడి దాడి చేసిన నలుగురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. నాన్నమ్మ పొలం విషయంలో చిన్న సాయిలు సోదరుని కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి తిట్టడంతో పాటు కొట్టారని బాధితుడి కుమారుడు సాయి కిరణ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాల్య వివాహం అడ్డగింత

బోధన్: మండలంలోని ఓ గ్రామంలో బాలిక వివాహాన్ని అధికారులు ఆదివారం రాత్రి అడ్డుకున్నారు. నిర్మల్ జిల్లా భైంసా మండల కేంద్రానికి చెందిన యువకుడితో సోమవారం ఉదయం గ్రామంలో వివాహానికి ఇరు కుటుంబాలు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకొని కుటుంబీకులతో చర్చించారు. బాల్య వివాహం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలికను బాలసదన్‌కు తరలించారు. మీడియేషన్ సెంటర్ ప్రతినిధి పద్మాసింగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఐసీసీఎస్ టీం సభ్యులు సౌజన్య, సాయిలు, స్వప్న తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

గాంధారి: విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన ఘటన గాంధారి మండలం బూర్గుల్‌లో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి భూమయ్య తన గేదెలను మేపడానికి శివారులలోని వ్యవసాయ భూమి వద్దకు తీసుకెళ్లాడు. విద్యుత్ స్తంభం వద్ద సపోర్ట్ వైర్‌కు గేదె తగలడంతో షాక్‌కు గురై మృతి చెందింది. గేదె విలువ రూ.60 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం నష్ట పరిహారం ఇప్పించాలని బాధితుడు కోరాడు.

నాగిరెడ్డిపేటలో..

నాగిరెడ్డిపేట: మండలంలోని మేజర్‌వాడి గ్రామశివారులో మేతకోసం వెళ్లిన ఓ ఆవు ఆదివారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. గ్రామంలోని కోడె లక్ష్మయ్యకు చెందిన ఆవు రోజూమాదిరిగానే మేతకోసం గ్రామశివారుకు వెళ్లింది. గ్రామ శివారులోని ఎస్ఎస్ నం 39 వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో సంభవించి ఆవు మృత్యువాత పడింది. ఆవు విలువ రూ. 50 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం బాధితునికి నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

నందిపేట్: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన నందిపేట మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాయాపూర్ గ్రామానికి చెందిన మేకల మురళి పని నిమిత్తం బైక్‌పై నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. దీంతో అతని ఎడమ కాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తాడ్వాయి: మండలంలోని కృష్ణాజివాడిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. కృష్ణాజివాడి గ్రామానికి చెందిన కుమ్మరి సుధాకర్, జంగం వికాస్, బ్రహ్మాజివాడి గ్రామానికి చెందిన శాల భరత్ వేర్వేరుగా తమ బైక్‌లపై కామారెడ్డి నుంచి తమ గ్రామాలకు కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై వస్తుండగా కృష్ణాజివాడిలోకి రాగానే ప్రమాదవశాత్తు ఒకదాని వెంట ఒకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేసుకొని వివరాలు సేకరించారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య



నర్సింలు (ఫైల్)

కామారెడ్డి క్రైం: అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మండలం గర్గుల్‌లో ఆదివారం చోటు చేసుకుంది. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుంటికాడి నర్సింలు(45) ఆటో నడిపిస్తూ జీవనం సాగించేవాడు. అతనికి ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొన్ని రోజుల క్రితం కుమార్తెకు వివాహం చేయగా అప్పుల య్యాయి. దీనికి తోడు ఆటో సరిగ్గా నడవక ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మానసికంగా కుంగిపోయేవాడు. శనివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం నిర్మాణంలో ఉన్న గంగపుత్ర సంఘం భవనం వద్ద ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి రెండో భార్య వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

సదాశివనగర్: బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భూంపల్లి గ్రామానికి చెందిన కార్తిక్‌రావు(24) కామారెడ్డి నుంచి బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో ఘటన స్థలిలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కార్తీక్‌రావు మృతదేహం

సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు సుబ్బారావు మృతి



మాక్లూర్: రాష్ట్ర, జాతీయ స్థాయి సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు మైనేని సుబ్బారావు (59) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన పుట్టి పెరిగింది కొత్తపల్లి గ్రామంలోనే. జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో పాల్గొని ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఆ క్రమంలోనే కబడ్డీ కోచ్‌గా నగరంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో కొనసాగుతూ వచ్చారు. ఈయన మృతిపై ఆయా క్రీడా కోచులు సంతాపం తెలిపారు. అంత్యక్రియలు జిల్లా కేంద్రంలో నిర్వహించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ శివారు మాధవనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి (45) ఆత్మహత్య చేసుకున్నట్లు నిజామాబాద్ రైల్వే ఎస్సై హెచ్ సాయిరెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మాధవనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి సికింద్రాబాద్ నుంచి ముంబై వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. శనివారం రాత్రి నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ హరికృష్ణ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712658591 నంబర్‌కు సమాచారం అందించాలని రైల్వే ఎస్సై సాయిరెడ్డి కోరారు.